

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.40 (307.2834)	54,305	54,305
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.55 (4.34)	1,912.14	1,448.88
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.948 (44.1326)	35,723	29,723

చికెన్ ధరలు | లైవ్: రూ.148 | డ్రెస్: రూ.220 | స్కిన్‌లెస్: రూ.250

నేడు దీపావళి



సూర్యాపేటటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెలుగు పూల పండుగ దీపావళి సందడి నెలకొంది. సోమవారం లక్ష్మీపూజ, మంగళవారం కేదారీశ్వరి నోములు, సత్యనారాయణ స్వామి వ్రతాలను జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. పలువురు ఇళ్లలో బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయాలు, దుకాణాలను విద్యుత్ దీపాలు, బంతి పూలతో అలంకరించారు. రహదారుల వెంట బంతిపూలు, మట్టి ప్రమిదలు, బొమ్మలు విక్రయిస్తున్నారు. పలు ప్రాంతాల్లో బాణాసంచా దుకాణాలు ఏర్పాటయ్యాయి. పలువురు పట్టణాల నుంచి సొంత ఊర్లకు వెళ్తుండడంతో రహదారులపై ట్రాఫిక్ పెరిగింది. బస్సులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నాయి. జిల్లా అంతటా దీపావళి సందడి నెలకొంది. జిల్లా కేంద్రం సూర్యాపేట, తదితర ప్రాంతాల్లో బంతిపూలు, పూజాసామగ్రి విక్రయాల సందడి నెలకొంది. అలాగే జిల్లా అంతటా సదర్ వేడుకలు నిర్వహించేందుకు యాదవ సంఘాలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

చీకటిని పారదోలే వెలుగుల పండుగ దీపావళి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీ‌ష్‌రెడ్డి



సూర్యాపేట టౌన్: చీకటిని పారదోలే వెలుగుల పండుగ దీపావళి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఒక ప్రకటన విడుదలచేస్తూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను నిర్వహించాలన్నారు. ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

బాణాసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

- ఎస్పీ నర్సింహ



సూర్యాపేటక్రైం: దీపావళి సం దర్భంగా బాణా సంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ నర్సింహ అన్నారు. ఆదివారం ప్రకటన విడుదలచేస్తూ జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సంతోషంగా, కలిసి మెలిసి పండుగను నిర్వహించాలన్నా రు. ఉత్సవాల పేరుతో ఇతరులను ఇబ్బందులకు గురిచేయవద్దని, మహిళలను గౌరవించాలన్నారు. అధికారుల అనుమతి లేకుండా ఎక్కడ పడితే అక్కడ బాణాసంచా విక్రయాలు చేయవద్దన్నారు.

హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలి

హుజూర్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతీ మనిషి హైందవ ధర్మాన్ని కాపాడాలని, భగవంతుడి ధ్యానంలో తరించాలని హైదరాబాద్ ఇస్కాన్ సంస్థ ప్రతినిధి హృషికేశ్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం పట్టణంలోని సాయిబాబా కల్యాణమండపంలో హరేరామ-హరేకృష్ణ ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో భగవద్గీతలోని 10వ అధ్యాయంపై సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువుల ద్వారా భగవద్గీతలోని కీలక అంశాలను తెలుసుకోవాలన్నారు. మనిషి జీవితంలో ప్రశాంతత ఎంత ముఖ్యమో భగవద్గీతను పఠించడం కూడా అంతే ముఖ్యమన్నారు. సమాజంలో ప్రతీ ఒక్కరు గురువులు, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ఆపదలో ఉన్న వారికి చేయూత అందించాలన్నారు. కులం, మతం అనే భేదం లేకుండా కలిసి జీవించాలన్నారు. హిందూమత పరిరక్షణకు పాటుపడాలన్నారు. హైందవ ధర్మాన్ని గౌరవించాలన్నారు. ఎదుటివారిని గౌరవిస్తేనే సమాజంలో ప్రతీ ఒక్కరికి గౌరవం దక్కుతుందన్నారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం చేశా రు. కార్యక్రమంలో నిర్వాహకులు మట్టపల్లి శ్రీమన్నారాయణ, పేరూరి అశోక్, శ్రీను, చంద్రశేఖర్, రాధ, నాని, అంజయ్య, సత్యనారాయణ, శేఖర్, వెంకటలక్ష్మి, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, అనంతరాములు, నాగేశ్వరరావు, పద్మ, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు భారీ ఏర్పాట్లు

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 25న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు భారీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. జాబ్‌మేళా నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్ మేళా విషయమై నిరుద్యోగ యువతీ యువకులకు సమాచారం అందించేందుకు ప్రచారం నిర్వహించాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని పలు పరిశ్రమలకు చెందిన ప్రతినిధులను కూడా ఈ మేళాకు ఆహ్వానించినట్లు తెలిపారు. మొత్తం 150 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. మెగా జాబ్‌మేళాపై విస్తృత ప్రచారం కల్పించడంలో గ్రామకార్యదర్శులను, విలేజ్ పోలీస్ అధికారులను భాగస్వామ్యం చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఉపాధి కల్పన కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకున్న వారిని గుర్తించి సమాచారం అందించాలన్నారు. ఇంజనీర్లు, పారామెడికల్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఐటీఐ ఫైనలియర్ విద్యార్థులు కూడా హాజరవ్వవచ్చని తెలిపారు. మేళాకు డీఈఈటీ, సింగరేణి కాలరీస్ అధికారులు సహకరించాలన్నారు. మేళాపై ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఉపాధి కల్పన కార్యాలయంలో పేర్లు నమోదుచేసుకున్న 8వేల మంది నిరుద్యోగులకు సమాచారం చేరిందని తెలిపారు. సోషల్‌మీడియా ద్వారా కూడా ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ నెల 21న హుజూర్‌నగర్‌లో జాబ్ మేళా స్థల పరిశీలన చేస్తానన్నారు. 22న మూడు జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాకు వచ్చే యువతీ, యువకులకు భోజన వసతి ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జాబ్ మేళాపై ఉమ్మడి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

తిరుమలగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు పత్తిని విక్రయించేందుకు వ్యవసాయ అధికారుల వద్ద పంట నమోదు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎల్.చామంతినరేష్ తెలిపారు. ఆదివారం తిరుమలగిరి మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు వారి సెల్‌ఫోన్‌లో 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకుంటే దగ్గరలోనే సీసీఐ కేంద్రంలో పత్తి విక్రయించే అవకాశం ఉంటుందన్నారు. రైతులకోసం మార్కెట్‌లో హెల్‌డెస్క్ ఏర్పాటుచేశామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రాపాక సోమేష్, ఆంగోతు రాములు, దొడ్డ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా దీపావళి సందడి


నల్లగొండలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు


సూర్యాపేటలో టపాకాయలు కొనుగోలు చేస్తున్న యువత


నల్లగొండ వర్తపల్లిలో...

చెడుపై మంచి సాధించే విజయాన్ని సూచించే దీపావళి పండుగకు జిల్లా ముస్తాబైంది. పూలు, ప్రమిదలు, టపాసుల కొనుగోలుతో మార్కెట్లు సందడిగా మారాయి. వరుస సెలవులతో జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. లక్ష్మీనృసింహుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో యాదగిరిగుట్ట ఆలయం కిటకిటలాడింది. పండుగ నిర్వహణకు స్వస్థలాలకు చేరటంతో బంధుమిత్రుల పలకరింపులు, చిన్ననాటి స్నేహితుల ముచ్చట్లతో పల్లెలు కోలాహలంగా మారాయి.




యాదగిరీశుడి సన్నిధిలో భక్తుల కోలాహలం




నల్లగొండలో


భువనగిరిలో గుమ్మడికాయలు కొనుగోలు చేస్తున్న స్థానికులు


సూర్యాపేటలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు


భువనగిరిలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ప్రమిదలు

జాగ్రత్తలు వహిస్తే ఆనంద దీపావళి

పండుగ వేళ విషాదాలకు తావు ఇవ్వవద్దు

కాలుష్య రహితానికే ప్రాధాన్యం ఇవ్వాలి



సూర్యాపేటటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళిని ప్రతీఇంట్లో సంతోషాలతో నిర్వహిస్తారు. అయితే బాణాసంచా కాల్చేప్పుడు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా పండుగ నిర్వహించవచ్చు. టపాసులు కాల్చేప్పుడు కళ్లకు గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కొంత మందికి దురదలు వస్తాయి. మరి కొందరికి కార్నియారాపిడి, రెటీనల్ సమస్యలు ఏర్పడి, నిర్లక్ష్యం చేస్తే అంధత్వానికి దారితీసే ప్రమాదం ఉంది. అంతేగాక పొగ కారణంగా స్వరపేటిక వాయడం, గొంతు ఇన్‌ఫెక్షన్ తలెత్తే ప్రమాదం ఉంది. టపాసులు కాల్చేటప్పుడు కళ్లద్దాలు ధరించడం శ్రేయస్కరం. ఒక గజం దూరం నుంచి టపాసులు కాల్చడం ఉత్తమం. కనీసం 5 మీటర్ల నుంచి వీక్షించాలి. కాంటాక్ట్ లెన్స్ ఉంటే తీసేయాలి. టపాసులు కాల్చాక పరిశుభ్రమైన నీటితో చేతులు కడుక్కోవాలి.

కాల్చేటప్పుడు ఏం చేయాలి

బాణాసంచాల కొనుగోలుచేసేటప్పుడు నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి. పిల్లలు టపాసులు కాల్చేప్పుడు పెద్దలు వారికి అతి సమీపంలో ఉండి తగిన జాగ్రత్తలు చెప్పాలి. డోర్ కర్టెన్లు, దుస్తులు ఉన్న చోట దూరంగా కొవ్వొత్తులు వెలిగించాలి. ప్రాథమిక చికిత్స కిట్‌ను అందుబాటులో ఉంచుకోవాలి. చాలా మంది యువకులు బాణాసంచాలను, చిచ్చుబుడ్లు, భూచక్రాలను చేతిలోనే కాల్చాలని అనుకుంటారు.

అలాంటి సాహసాలకు పూనుకుంటే ప్రమాదాలను కొనితెచ్చుకున్నట్లే. కాల్చి న టపాసులను నలిపివేయడం, వాటిపై నీరు పోయడం, మట్టిని చల్లడం చేయాలి. సగం కాలిన టపాసులను వదిలేయకుండా నీళ్ల బకెట్లలో వేస్తే మంచిది. సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టాలనే ఉత్సాహంతో టపాసులు కాలుస్తూ సెల్ఫీలకు ప్రయత్నించకూడదు. టపాసులు కాల్చేటప్పుడు సింథటిక్ దుస్తులు ధరించకూడదు.

త్యాగధనుల స్మృతిలో..

- విధి నిర్వహణలో అసువులు బాసిన రక్షక భటులు
- నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- గుట్ట పోలీస్‌స్టేషన్ పేల్చి 28 ఏళ్లు

అంకితభావంతో పనిచేయడమే వారి లక్ష్యం. విధి నిర్వహణలో ప్రాణాల్ని సైతం లెక్కచేయకపోవడం వారి నైజం. సమాజ రక్షణకు అహర్నిషలు కృషి చేస్తూ.., రాత్రనక, పగలనక అసాంఘిక శక్తులతో పోరాడుతున్న పోలీసుల త్యాగం వెలకట్టలేనిది.

\- (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)


వంగపల్లిలో అనాథ వృద్ధురాలికి ఆహార పదార్థాల కిట్టును అందజేస్తున్న ఏసీపీ, సీఐ (ఫైల్)

ఆపదైనా, అత్యవసరమైనా క్షణకాలంలో ఎదుట నిలిచి ఆపన్నహస్తం అదించే గురుతర బాధ్యతను పోలీసులు నిర్వహిస్తున్నారు. హింసను అరికట్టడం, నేరాలను తగ్గించడం, మత్తు పదార్థాల వంటి సమస్యలను నివారించడంలో పోలీసులు పోరాటం చేస్తూనే ఉంటారు. ఈ అసాంఘిక శక్తులపై పోరాటంలో ప్రాణాలను కోల్పోయిన పోలీసులు ఎందరో. తమ కుటుంబాలను సైతం వదిలి సమాజ రక్షణ కోసం నిరంతరం పాటుపడే పోలీసుల త్యాగాలను స్మరించుకొనే రోజే అక్టోబరు 21. పోలీసుల అమరుల త్యాగాల గుర్తుచేసుకొనే ఈ రోజుకు ఎంతో ప్రత్యేకత ఉంది.

సామాజిక సేవలోనూ పోలీసుల పాత్ర

ఓ వైపు శాంతి భద్రతలను పరిరక్షిస్తూ పట్టణంలో అనాథలై వీధుల్లో భిక్షాటన చేస్తున్న వృద్ధులకు పోలీసులు అండగా నిలుస్తున్నారు. రాచకొండ సీపీ ఆదేశాల మేరకు మరోవైపు యాదగిరిగుట్ట సబ్‌డివిజన్ ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు పర్యవేక్షణలో స్థానిక సీఐ బొడ్డుపల్లి భాస్కర్, పోలీస్ సిబ్బంది గుట్టలో వృద్ధులకు ఆర్థిక సహకారం, దుస్తులు, ఆహార పదార్థాలు అందజేస్తున్నారు. అనాథలుగా వదిలివేసిన వృద్ధులను వారి కన్నబిడ్డలు, కుటుంబ సభ్యులను పిలిపించి వారి వద్దకు చేర్చి పోషించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. యువత డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌ల భారీన పడి జీవితాలు నాశనం చేసుకోకుండా, వారి కుటుంబాలు ఇబ్బందులకు గురికాకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగహన సదస్సులు నిర్వహిస్తూ సమాజ రక్షణలో పోలీసులు కీలక భూమిక పోషిస్తున్నారు.

సమాజంలో పోలీసులు వ్యవస్థ లేకుంటే మనుగడ సాధించలేం..



సమాజంలో పోలీసు వ్యవస్థలేకుంటే మనుగడ సాధించలేం. గొడవలు, అల్లర్లు, కుటుంబ సమస్యలు, హత్యలు, రౌడీలను నివారంచడం , ఎన్నికల్లో ప్రతి విషయంలో పోలీసుల పాత్ర కీలకం. ప్రజలు శాంతియుతంగా కంటి నిండ నిద్రపోతున్నారంటే అందుకు పోలీసుల సేవలు అందుకు నిదర్శనం.

\- భీమగాని నర్సింహగౌడ్, పెద్దకందుకూర్

అమరుల స్ఫూర్తితో ముందుకు వెళ్తాం



పోలీస్ అమరుల స్ఫూర్తితో ముందుకు వెళ్తాం. వారి త్యాగాల ను భావితరాలకు అందించడానికే పోలీస్ అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తున్నాం. శాంతిభద్రతలను కాపాడటంలో పోలీస్‌లు కీలకపాత్ర పోషిస్తున్నారు. కేవలం విధులు నిర్వహించడమే కాకుండా గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై యువతకు అవగహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

\- శ్రీనివాస్‌నాయుడు, యాదగిరిగుట్ట ఏసీపీ

యాదగిరిగుట్ట పోలీస్ అమరుల యాదిలో..

యాదగిరిగుట్ట పట్టణంలో 1998 జనవరి 17న నక్సలైట్లు పోలీస్‌స్టేషన్‌ను పేల్చివేసిన ఘటన జరిగి 28 ఏళ్లయింది. అప్పట్లో విధినిర్వహణలో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లు, మిర్యాలగూడకు చెందిన వారి మిత్రుడు మృతి చెంది 28 ఏళ్లు పూర్తయింది. నాటి చేదు అనుభవాలు నేటికీ పోలీసులు మరువలేకపోతున్నారు. నాటి నుంచి నేటి వరకు ప్రతీ సంవత్సరం వారి యాదిలో నివాళి అర్పిస్తూ, వారిని స్మరించుకుంటున్నారు.

పైసల్లేక ఏడాదిన్నరాయే!



- ఉపాధి కార్యాలయాల నిర్వహణ ఎలా?
- ఉమ్మడి జిల్లాలో 73 ఉపాధి కార్యాలయాలు
- నెలనెలా ఖర్చులు భరించలేక సతమతమవుతున్న ఏపీవోలు
- వేతనాలు అందక ఇబ్బంది పడుతున్న సిబ్బంది

మోత్కూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కూలీలకు ఉపాధి చూపుతున్న ఎన్ఆర్ఈజీఎస్ (జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం) కార్యాలయాలకు ప్రభుత్వం నుంచి నిర్వహణ ఖర్చులు అందడం లేదు. దీంతో ఏపీవో (అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్)లు నానా తంటాలు పడుతున్నారు. ప్రతీ నాలుగు నెలలకోసారి అందాల్సిన నిర్వహణ ఖర్చులు ఏడాదిన్నర (నాలుగు విడతలు)గా అందకపోవడంతో పలువురు ఏపీవోలు అప్పులు చేసి కార్యాలయాలను నడుపుతున్నారు. వచ్చే వేతనమే నెలనెల సకాలంలో అందక, చాలీచాలని వేతనంతో ఇంటి ఖర్చులకే ఇబ్బందిపడుతున్న ఏపీవోలకు కార్యాలయాల నిర్వహణ అదనపు భారమైంది.

తప్పని నిర్వహణ ఖర్చులు..

ఉపాధి కార్యాలయాల్లో ప్రతీ రోజు స్టేషనరీ అవసరముంటుంది. నెలనెలా కరెంటు బిల్లు, ఇంటర్‌నెట్ బిల్లు చెల్లించాలి. సమావేశాలు నిర్వహించినప్పుడు చాయ్, బిస్కట్లు, కంప్యూటర్, ప్రింటర్ రిపేర్‌కొస్తే బాగు చేయించడం తప్పదు. ఒక్కో కార్యాలయానికి మండలంలోని గ్రామాలు, కూలీలను బట్టి రూ.3వేలనుంచి రూ.3,500 వరకు స్టేషనరీ, నెలకు సుమారు రూ.1500 వరకు కరెంటు బిల్లు, సుమారు రూ.వెయ్యి వరకు ఇంటర్‌నెట్ బిల్లు చెల్లించడంతో పాటు ఇతర ఖర్చులు భరించాల్సిందే.

నాలుగు కేటగిరీలుగా నిర్వహణ ఖర్చుల కేటాయింపు..

కేంద్ర ప్రభుత్వం కూలీల పని దినాల ఆధారంగా కార్యాలయాలకు నిర్వహణ ఖర్చులు కేటాయిస్తుంది. రాష్ట్రంలోని ఉపాధి హామీ కార్యాలయాలను నాలుగు కేటగిరీలుగా విభజించి నిర్వహణ ఖర్చులు నిర్ణయించింది. నిర్వహణ ఖర్చులు ఏడాదికి మూడు విడతలుగా ప్రతీ నాలుగు నెలలకోసారి చెల్లించాలి. లక్ష కన్నా తక్కువ పనిదినాలు ఉన్న కార్యాలయాలకు రూ.60 వేలు, వీటిని మొదటి విడత రూ.30వేలు, మిగతా రెండు విడతలు రూ.15వేల చొప్పున చెల్లిస్తారు. లక్ష నుంచి రెండులక్షల పనిదినాలు ఉన్న కార్యాలయాలకు రూ.75వేలు, వీటిని మొదటి విడత 37,500, మిగతా రెండు విడతలు రూ.18,750 చొప్పున, రెండు లక్షల నుంచి మూడు లక్షల పనిదినాలు ఉన్న కార్యాలయాలకు రూ.85వేలు, వీటిని మొదటి విడత రూ.42,500, మిగతా రెండు విడతలు రూ.21,250 చొప్పున, మూడు లక్షల కన్నా ఎక్కువ పనిదినాలు ఉన్న కార్యాలయాలకు రూ.లక్ష, వీటిని మొదటి విడత రూ.50వేలు, మిగతా రెండు విడతలు రూ.25వేల చొప్పున చెల్లిస్తారు.

ఏపీవోలకు వచ్చే వేతనమే తక్కువ

ఉపాధి హామీ కార్యాలయాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఏపీవోలు రెగ్యులర్ కాలేదు. వారు ఎఫ్‌టీఈలు (ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్)గా కొనసాగుతున్నారు. వారికి వారి సీనియార్టీని బట్టి నెలకు రూ.44వేల నుంచి రూ.56వేల వేతనం అందుతుంది. వారికి మూడేళ్లుగా టీఏ, డీఏ సౌకర్యం రద్దుచేశారు. వారు ఫీల్డ్‌కు వెళ్లినా, సమావేశాలకు ప్రధాన కార్యాలయానికి వెళ్లినా సొంత ఖర్చులతో వెళ్లాల్సిందే.

వేతనాలు అందక ఇబ్బంది పడుతున్న సిబ్బంది

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలు, ఏపీవోలు, టీఏలకు ఒక నెల, అటెండర్‌కు 5నెలలు, ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్లకు 2నెలల వేతనాలు రావాల్సి ఉంది. బతుకమ్మ, దసరా పండుగలను సైతం అప్పుచేసి జరుపుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కార్యాలయాల నిర్వహణ ఖర్చులు, పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏపీవోలు, ఉపాధి సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు.

తగ్గిన పనిదినాలు

కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల పనిదినాలు ఏడాదికింత తగ్గిస్తోంది. కరోనా కాలంలో 2021-22లో రాష్ట్రంలో 14.25 కోట్ల పనిదినాలు ఉండగా, 2022-23లో 11 కోట్లకు, 2023-24లో 10.50 కోట్లకు తగ్గించింది. 2024-25లో 12కోట్లకు పెంచిన పని దినాలను 2025-26లో 6.50 కోట్లకు తగ్గించింది.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 73 ఉపాధి కార్యాలయాలు...

యదాద్రి భువనగిరి జిల్లాలో 17, సూర్యాపేట జిల్లాలో 23, నల్లగొండ జిల్లాలో 33 ఉపాధి హామీ కార్యాలయాల చొప్పున ఉమ్మడి జిల్లాలో 73 ఉపాధి కార్యాలయాలున్నాయి. రాష్ట్రంలో లక్ష కన్న తక్కువ పని దినాలు ఉన్న కార్యాలయాలు 43, రెండు లక్షలలోపు పనిదినాలు ఉన్న కార్యాలయాలు 191, మూడు లక్షలలోపు పని దినాలు ఉన్న కార్యాలయాలు 185, మూడు లక్షలకు పైన పనిదినాలు ఉన్న కార్యాలయాలు 120 ఉన్నాయి. ఈ ఉపాధి హామీ కార్యాలయాలకు 2024-25 ఏడాదికి మూడు విడతలు, 2025-26 సంవత్సరంలో మొదటి విడత కలిపి మొత్తం రూ.6,69,4500 నిర్వహణ ఖర్చులు చెల్లించాల్సి ఉంది.

పండుగకు వచ్చి పరలోకానికి...

• వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. పీఏపల్లి, కేతేపల్లి, నార్కట్‌పల్లి మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున దుర్మరణం చెందారు.

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పండుగకు వచ్చిన యువకుడు పరలోకానికి వెళ్లాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొని బీటెక్ విద్యా ర్థి మృతి చెందాడు. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిలోని ఘనపురం స్టేజీ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు, స్థా నికుల తెలిపిన వివరాల ప్రకారం... గుడిపల్లి మండలం కోదండపురం గ్రా మానికి చెందిన మైనం అర్జున్ రాంప్రసాద్ (23) హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేసి కోచింగ్ తీసుకుంటున్నాడు. దీపావళి పండుగ కు స్వగ్రామం గుడిపల్లి మండలం కోదండపురం గ్రామానికి వస్తున్నాడు. కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిలోని ఘనపురం శివారులో గుర్తు తెలియని వాహనం అర్జున్ స్కూటీని ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన అర్జున్ రాంప్రసాద్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో కోదండపురం గ్రామంలో విషాదఛాయ లు అలుముకున్నాయి. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గుడిపల్లి పోలీసులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అనంతరం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.


అర్జున్ రాంప్రసాద్ (ఫైల్‌ఫొటో)

ద్విచక్ర వాహనాలు ఢీకొని ...

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి-అద్దంకి రాష్ట్ర రహదారిపై నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శివారు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి గ్రామస్థులు తెలిసిన వివరాల మేరకు... చెర్వుగట్టుకు చెందిన మేకల వెంకట్‌రెడ్డి (58) తన వ్యవసాయ బావి వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తున్నాడు. అదే దారిలో నార్కట్‌పల్లి వైపునకు వస్తున్న దిచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన మేకల వెంకట్‌రెడ్డిని హుటాహుటిన నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు వెంకట్‌రెడ్డి గతంలో చెర్వుగట్టు దేవస్థానం ధర్మకర్తగా పనిచేశారు. వెంకట్‌రెడ్డి అకాల మృతి పట్ల పలువురు నాయకులు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, మేకల అరుణరాజిరెడ్డి, మల్ల బాలకృ ష్ణ, రేగట్టె నర్సిరెడ్డి, కమ్మంపాటి వెంకటయ్య, నేతకాని కృష్ణయ్య, వారాల రమేష్, పున్నంరాజు యాదగిరి, రేగట్టె రాజశేఖర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, మల్ల శంకర్ తదితరులు సంతాపం తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నాడు. ఈ సంఘటనపై ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.


మేకల వెంకట్‌రెడ్డి (ఫైల్)

కారు ఢీకొని ఒకరు...

కేతేపల్లి: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామ శివారులో 65వ నెంబరు జాతీయ రహదారిపై గల వైజంక్షన్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇనుపాముల గ్రామానికి చెందిన పాశం రాంరెడ్డి (48) నకిరేకల్ వైపు నుంచి ఇనుపాముల వైపున హైవే వెంట ఉన్న తన ఇంటికి వెళ్లేందుకు వై జంక్షన్‌లో కాలినడకన రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న టవేరా వాహనం రాంరెడ్డిని ఢీకొట్టింది. దీంతో రాంరెడ్డి తలకు బలమైన గాయాలతో పాటు ఒక చేయి, ఒక కాలు విరిగాయి. తీవ్రంగా గాయపడిన రాంరెడ్డిని బంధువులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ వివరించారు.

దుబాయ్‌కి వెళ్తున్నానంటూ బలవన్మరణం

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 'దుబాయ్‌కు వెళ్తున్నాను. మూడు నెలల వరకు తిరిగి రాను' అంటూ ఇంట్లో చెప్పిన ఓ యువకుడు నగర శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిపల్లి గుట్టల ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా ఎర్కారం గ్రామానికి చెందిన బొర్ర నరేష్ కాలుష్య తనిఖీ వాహనంలో పనిచేస్తూ నగరంలోని రాయదుర్గం షేక్‌పేటలో నివాసం ఉంటున్నారు. గత నెల సెప్టెంబరు 29వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అతను సోదరుడికి ఫోన్ చేసి దుబాయ్ వెళ్తున్నానని మూడు నెలల వరకు రానంటూ చెప్పాడు. అనంతరం అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. మరుసటి రోజు అతడి సోదరుడు రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టాడు. అయితే అతడు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిపల్లి గుట్టల్లో తాడుతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అబ్దుల్లాపూర్‌మెట్ పో టలీసులకు శనివారం ఉదయం సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. సెల్ నెంబర్ లభించిన ఆధారాలతో మృతుడి వివరాలు సేకరించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రారంభానికి ముందే విషాదం

● రేకుల షెడ్ కూలి తల్లీకుమారుడు మృతి

● ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలు



నాగమణి, విరాట్‌కృష్ణ(ఫైల్)

చిట్యాలరూరల్, మాడ్గులపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగకు కొత్త వ్యాపారంలో కి ప్రవేశించి తమ జీవి తాల్లో వెలుగు నింపు కోవాలనుకున్న ఓ కు టుంబంలో చీకట్లు నిం డాయి. కాఫీ దుకా ణా న్ని ప్రారంభించేం దు కు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో రేకుల షెడ్డు కూలి అక్కడే నిద్రిస్తున్న తల్లీకుమారులు మృతిచెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా చిట్యా ల మండలం పెద్దకాపర్తి శివారులో ఈ విషాదం నెలకొంది. చిట్యాల ఎస్ఐ మామిడి రవి కుమార్, స్థా నికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండల కేంద్రానికి చెందిన ప గుళ్ల వెంకన్నకు నిడమనూరు మండలం వంగాల గూడెం గ్రామానికి చెందిన నాగమణి(32)తో తొమ్మిదేళ్ల క్రితం వివాహంకాగా, కుమా రుడు విరాట్‌కృష్ణ (7), కుమార్తె నందిని ఉ న్నారు. వెంకన్న రైల్వే శాఖలో గ్యాంగ్‌మన్ గా తిప్పర్తి మండలంలో పనిచేస్తున్నాడు. కు టుంబ అవసరాల నిమిత్తం ఆదాయాన్ని పెంచుకునేందుకు చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో స్థలాన్ని అద్దెకు తీసుకుని ఫిల్టర్ కాఫీ కేఫ్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. దుకాణం వెనుక సిమెంటు రేకులతో ఓ షెడ్డును నిర్మించి, ఓ మూలన ఇనుప పట్టీలు ఏర్పాటుచేసి దానిపై ప్లాస్టిక్ నీటి ట్యాంకును ఏర్పాటు చేశాడు.

పండుగకు ముందురోజే ప్రారంభించాలని..

దీపావళి పండుగ సందర్భంగా ముందు రోజైన ఆదివారమే కాఫీ కేఫ్ ప్రారంభించేం దుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తల్లి పార్వతమ్మ, భార్య నాగమణి (32), కుమార్తె నందిని, కుమారుడు విరాట్‌కృష్ణ(7)లను పెద్దకాపర్తికి తీసుకువచ్చాడు. శనివారం రాత్రి భోజనాల అనంతరం పనులు పూర్తి చేసుకుని కుటుంబ సభ్యులు అందరూ కేఫ్ వెనుక ఉన్న గదిలో నిద్రకు ఉపక్రమించారు. దుకాణం ప్రారంభోత్సవం ఉన్నందున వెంకన్న ఆదివారం తెల్లవారుజామున భార్యాపిల్లలను నిద్రలేపకుండా పూజా కార్యక్రమాలకు సన్నద్ధమయ్యాడు. ఈ క్రమంలో నీటిట్యాంకును నింపేందుకు బోరు వేశాడు. ట్యాంకులో నీరు పూర్తిస్థాయిలో నిండుతూ బరువు అధికమై రేకులషె డ్డుపై పడిపోయింది. ట్యాంకు సిమెంట్ రేకులపై పడటంతో అవి పగిలిపోయి షెడ్డు కింద నిద్రిస్తున్న నాగమణి, విరాట్‌కృష్ణ, పార్వతమ్మ, నందినిలపై పడింది. ఒక్కసారిగా పెద్దశబ్దం రావడం, వెనుక గదిలో అరుపులు రావడంతో ముందు భాగంలో కేఫ్ వద్ద పనుల్లో ఉన్న వెంకన్న, ఇతరులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. గదిలో ఉన్న వారిపై రేకులు, నీటిట్యాంకు పడి ఉండటాన్ని గమనించి పక్కకు తొలగించారు. నాగ మణి, విరాట్‌కృష్ణ, పార్వతమ్మ, నందినిలకు తీవ్ర గాయాలుకాగా, నార్కట్‌పల్లి శివారు లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో నాగమణి, విరాట్‌కృష్ణ మృతి చెందారని వైద్యులు నిర్ధారించగా, పార్వతమ్మ, నందినిలకు వైద్య చికిత్స అందిస్తు న్నారు. పగుళ్ల వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ తెలిపారు. పండుగకు ముందురోజే కాఫీ కేఫ్‌ను ప్రారంభించే సంతో షంలో ఉండగా భార్య, కుమారుడు మృతి చెందడం విషాదాన్ని నింపింది. బతుకుదె రువు కోసం వెళ్లొస్తామంటూ మాడ్గులపల్లిలో ఇరుగుపొరుగువారికి చెప్పి బయలుదే రిన నాగమణి తిరిగిరాని లోకాలకు చేరుకోవడంతో అక్కడి వారు కన్నీరుమున్నీరై విల పించారు. నాగమణి, విరాట్‌కృష్ణ మృతదేహాలకు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మాడ్గులపల్లిలో తల్లీకుమారుల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు.

విషాద సమయంలోనూ మానవత్వం

మాడ్గులపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): షెడ్డు కూలి మృతిచెందిన ఘటనలో తల్లీకుమారుల నేత్ర దానానికి కుటుంబసభ్యులు అంగీకరించి మానవత్వం చాటారు. నాగమణి, విరాట్‌కృష్ణల మృతదేహాలు పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, డొనేషన్ సెంటర్ నిర్వాహకులు మృతుల కుటుంబ సభ్యులను సంప్రదించారు. భర్త వెంకన్న, కుటుంబసభ్యుల అంగీకారంతో నేత్రాల కార్నియాను టెక్నీషియన్ బచ్చలకూరి జాని సేకరించారు. విషాద సమయంలోనూ నేత్రాలను దానం చేసి మానవత్వం ప్రదర్శించారని స్థానికులు ప్రశంసించారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన వైష్ణవి



వైష్ణవి

మునుగోడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మునుగోడు మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పి. వైష్ణవి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెర్వు మైత్రి ఆవరణలో నిర్వహించిన ఎస్‌హెచ్‌ఎఫ్ రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా బాలికల జట్టు ఉత్తమ ఆటతీరు కనబరిచి తృతీయ స్థానంలో విజయం సాధించింది. ఈ జట్టులో ఉన్న వైష్ణవి ఉత్తమంగా రాణిం చింది. ఇటీవల ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయిలో నిర్వహిం చిన ఎస్‌హెచ్‌జీ క్రీడల్లో భాగంగా కబడ్డీ అండర్- 14 బాలికల విభాగంలో ఉత్తమ ఆటతీరుతో ప్రథమ బహుమతి గెలుచుకుందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి తెలిపారు. ఆదివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినితో పాటు పీఈటీ నాగమణి, విజయలను ఉపాధ్యాయులు అభినందించారు.

పేద విద్యార్థులకు చేయూత



సమావేశంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

హాలియా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్య చెప్పిన గురువుల జ్ఞాపకార్థం పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తోడ్పాటును అందిస్తామని ఎమ్మార్సీ ఫౌండేషన్ చైర్మన్ చిట్టిపోలు యాదగిరి అన్నారు. హాలియా జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 1985-86 నుం చి 1991- 92 వరకు ఆ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులంతా కలిసి ఆత్మీయ స మ్మేళనం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థుల కోసం ఏదో ఒకటి చే యాలనే ఆలోచనతో తమ ఎదుగుదలకు కారణమైన గురువు రామానాజాచార్యులను స్మరించుకొని వారి పేరుపై పేద విద్యార్థులకు విద్యను అందించాలనే లక్ష్యంతో ఎమ్మా ర్సీ ఫౌండేషన్‌ను 500 మంది విద్యార్థులతో ఏర్పాటు చేయడానికి అంకురార్పణ చేశారు. అదే విధంగా పాఠశాల విద్యార్థుల కోసం పూర్వ విద్యార్థి, వ్యాపారవేత్త, వజ్రతేజ రైస్‌క్ల స్టర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టిపోలు యాదగిరి, పూర్వ విద్యార్థులు కలి పి సైకిల్‌స్టాండ్‌ను ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. 40 సంవత్సరాల కింద వారు నాటిన మొక్కలను స్పర్శించారు. కార్యక్రమంలో పూర్వ ఉపా ధ్యాయులు నర్సింహారావు, ప్రభాకర్‌రావు, పాండరయ్య, హనుమంతరావు, యాదగిరి రెడ్డి, మోహన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మల్లయ్య, సోమయ్య, ఎంఈవో కృష్ణమూర్తి, పూర్వ విద్యార్థులు చిట్టిపోలు యాదగిరి, కాకునూరి వెంకటేశం, నక్క శేఖర్, షేక్ జలీల్, కుకుడాల ఆంజనేయులు, మహేందర్, పాల్వాయి శంకర్, గుర్రం శ్రీను, వాడాల వెంక టయ్య, మహ్మద్ హుస్సేన్, వెంకటనారాయణరెడ్డి, మాల కొండయ్య, నాగిరెడ్డి, చంద్రశే ఖర్, గంజి శ్రీను, నర్సింహ, రవీంద్రాచారి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు, యువత కరాటేలో రాణించాలి

దేవరకొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత కరాటేలో రాణించా లని దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేష న్ భవనంలో నియోజకవర్గంలో వివిధ మండలాలకు చెందిన విద్యార్థులకు కరాటే బె ల్టు, గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేసి మాట్లా డారు. నేటి సమాజంలో బాలికలు, మహిళల మీద జరుగుతున్న దాడులను ఎదుర్కోవ డానికి కరాటే ఎంతో అవసరం అన్నారు. విద్యార్థులు కరాటే నేర్చుకోవాలని కోరారు. స్పో ర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాస్టర్ గోపినాయక్ ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తున్న ట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, తాళ్ల సురే ష్, ఆంజనేయులు, లచ్చిరాం, లక్‌పతి, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలి

దేవరకొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాల ని దేవరకొండ నియోజకవర్గ బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు కుర్మేటి రవిప్రసాద్‌శర్మ అ న్నారు. దేవరకొండ పట్టణంలోని కోదండరామాలయంలో ఆదివారం నిర్వహించిన బ్రా హ్మణసంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్రాహ్మణుల సంఘం భవ నానికి నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. దీపావళి పండుగను అందరూ సుఖ సంతోషాలతో నిర్వహించుకోవాలని కోరారు. చీకటి నుంచి వెలుగులను ఇచ్చేది దీపావళి అని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు సురభి కృష్ణ మూర్తి శర్మ, ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌శర్మ, మీడియా కార్యదర్శి గాదె గిరిధర్ రావు, ప్రవీణ్‌కుమార్‌శర్మ, వెంకటేశ్వరశర్మ, వైద్యుల కృష్ణమూర్తిశర్మ పాల్గొన్నారు.

హుజూర్‌నగర్-మట్టపల్లి రోడ్డుకు మహర్దశ

● రూ.80కోట్లతో రోడ్డు పనులు ప్రారంభం ● తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యం ● సుమారు 24కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు

తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు ప్రభుత్వం సంకల్పించింది. తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన ఏపీలోని పల్నాడు జిల్లా పరిధి వరకు డబుల్ రోడ్డు పను లను విస్తరిస్తున్నారు. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మట్టపల్లి కృష్ణానదిపై రూ.50 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మిం చగా తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు రూ.80కోట్లతో హుజూర్‌నగర్ నుంచి మట్టపల్లి వరకు డబల్ రోడ్డును మరింత విస్తరిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి - హుజూర్‌నగర్)



కొనసాగుతున్న హుజూర్‌నగర్- మట్టపల్లి రోడ్డు ప్యాచ్‌వర్క్

హుజూర్‌నగర్ ఉంచి మగ్దుమ్‌నగర్, ఎర్రగట్టు, బక్కమంతు లగూడెం, చౌటపల్లి, మఠంపల్లి, పెదవీడు గ్రామాల మీదుగా మట్టపల్లి లక్ష్మీనర్సింహాస్వామి పుణ్యక్షేత్రం వరకు నిర్మించనున్న రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. సుమారు 24కిలోమీటర్ల దూరం గ్రామీణ రహదారి నిర్మించనున్నారు. నిర్మాణానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.80కోట్ల నిధులు మంజూరు చేయించారు. 10 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం 7మీటర్ల వెడల్పు ఉండగా దీనిని 10 మీటర్ల వెడల్పుగా చేయడంతో మొత్తం 100 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. 24 కిలోమీ టర్ల దూరంలో హుజూర్‌నగర్ సమీపంలో ఒక బ్రిడ్జిని, పెదవీడు వద్ద మరో బ్రిడ్జిని నిర్మించనున్నారు. తెలంగాణ-ఆంధ్రా సరిహద్దు ప్రాంతంగా ఉన్న మఠంపల్లి, మట్టపల్లి వరకు డబుల్‌లైన్ రోడ్డు నిర్మించనున్నారు. హుజూర్‌నగర్, చౌటపల్లి, మఠంపల్లి, పెదవీడు గ్రామాల పరిధిలో ఫోర్‌లైన్ నిర్మించనున్నారు. నియోజకవర్గ కేంద్రం నుంచి ఏపీలోని దాచేపల్లి వరకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సు సర్వీసును కూడా ఏర్పాటుచేసింది. రెండేళ్లలో పనులు పూర్తిచే యాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడు తుండగా రోడ్డు ప్యాచ్ వర్క్‌లు జరుగుతున్నాయి. ఏడాదిన్నర వ్యవధి లోనే పనులు పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించారు. నియోజకవర్గం లోని మఠంపల్లి మండలంలోని కృష్ణా పరివాహక ప్రాంతంలో అనేక సిమెంట్ పరిశ్రమలున్నాయి. పరిశ్రమలకు వచ్చిపోయే వాహనాలతో మట్టపల్లి రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. దాంతో పాటు ప్రతి శుక్ర, శనివారాలు మట్టపల్లి పుణ్యక్షేత్రానికి భక్తులు వచ్చిపోతుంటారు. కృష్ణా నదిపై నిర్మించిన శ్రీమట్టపల్లి నర్సింహాస్వామి వారధి పూర్తి కావడంతో ఏపీకి చెందిన వాహనాలు సైతం బ్రిడ్జి నుండి వచ్చిపోతున్నాయి. ఏపీలోని అనేక పరిశ్రమల వాహనాలు హుజూర్‌నగర్ మీదుగా వస్తూ పోతున్నాయి. రవాణా సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభు త్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయగా పనులు పూర్తిచేసేం దుకు అధికారులు దృష్టి కేంద్రీకరించారు. మట్టపల్లి - హుజూర్‌నగర్ రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనేకసార్లు సమీక్షలు, సమావేశాలు నిర్వహించారు. దానికి అనుగు ణంగా ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ ప్రగతి పనులు చేపట్టారు.

ప్రమాదాల నివారణకు..

హుజూర్‌నగర్ నుంచి వెళ్లే మట్టపల్లి రోడ్డంటేనే ప్రమాదాలకు నిల యంగా మారింది. హుజూర్‌నగర్ సమీపంలోని మగ్దుమ్‌నగర్, ఎర్రగ ట్టు, పెదవీడు, మఠంపల్లి ప్రాంతాల్లో నిత్యం ప్రమాదాలు జరుగుతు న్నాయి. పరిశ్రమలకు వచ్చిపోయే వాహనాలు, ఆటోలు, మోటార్ సైకిళ్ళు ఢీ కొని పదుల సంఖ్యలో మృతిచెందారు. మట్టపల్లికి వెళ్లే రహదారి ఒకరకంగా మృత్యుమార్గంగా ఏర్పడింది. ప్రమాదాల నివార ణకు రోడ్డు వెడల్పే శరణ్యమని భావించిన ప్రభుత్వం రోడ్డు విస్తర ణకు శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలోనే భారీ నిధులతో డబుల్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

హుజూర్‌నగర్ నుంచి మట్టపల్లి వరకు నిర్మించనున్న రోడ్డును త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించాం. నిర్ణీత గడువు లోపు రోడ్డు విస్తరణ చేసేందుకు అధికారులు దృష్టిపెట్టాలి. పూర్తి నాణ్యతో ప్రమాణాలతో రోడ్డు నిర్మించాలి. మట్టపల్లి రోడ్డుతో పాటు నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో రూ.150 కోట్లతో పలు గ్రామీణ రహదారులను నిర్మించను న్నాం. వాటి పనులు కూడా వెంటనే పూర్తిచేయాలి.

● నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి



దుమ్ము, ధూళి నుంచి కాపాడాలి



చౌటపల్లి గ్రామంలో రాస్తారోకో చేస్తున్న మహిళలు

మఠంపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఏర్పడిన గుంతలతో దుమ్ము, దూళి ఇళ్లలోకి వచ్చి జబ్బులకు గురవుతన్నామని చౌటపల్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మట్టపల్లి- హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రధాన రహదారిలో గుంతలు పడ్డాయని, దీంతో రాత్రి వేళ్లలో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. గుంతల్లో కంకరు మరుస పోయకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న గుంతల వలన చిరు వ్యాపారులు టిఫిన్ సెంటర్లు దుమ్ము, దూళితో నిండి ఇబ్బందులు పడుతన్నారని తెలిపారు. ఈ రహదారిగుండా లారీలు, ప్రధాన రహదారిపై ఉన్న గ్రామస్థులు దుమ్ము దూళితో ఇబ్బదులకు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారుల హామీతో రాస్తారోకో విరవింపజేశారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేటఅర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): హుజూర్‌నగర్ పట్టణంలో ఈ నెల 25వ తేదీన నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. హుజూర్‌నగర్‌లో ఈ నెల 25వ తేదీన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోగల పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ పాఠశాల వద్ద ఇరిగేషన్, కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుమారు 155 ప్రైవేట్ సంస్థలు 2వేల నుంచి 5వేల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. ఉద్యోగ మేళకు 10వతరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఎంబీఏ, బీటెక్, పీజీ, ఫార్మసీ అర్హతలు కలిగి 18సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలలోపు వారు అర్హులని తెలిపారు.

గీత కార్మికులకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి



సూర్యాపేటలో ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేటఅర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర గీతా పనివారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొమ్మగాని శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కొండ కోటయ్య డిమాండ్ చేశారు. సీపీఐ వార్షికో త్సవం సందర్భంగా ఆదివారం జిల్లాకేంద్రంలో ధర్మబిక్షం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. గీత కా ర్మికుల పక్షాన పోరాటం చేసిన మహనీయుడు మాజీ ఎంపీ దర్మ బిక్షం అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దొరపెల్లి శంక ర్, బాబు, బూర వెంకటేశ్వర్లు, సైదులు, విష్ణు, శ్రీకాంత్, హేమ లత, వెంకయ్య, పిచ్చయ్య, జానయ్య, లింగయ్య పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: గీత కార్మికులకు ప్రత్యేక బోర్డు ఏర్పాటుచేయా లని ఆ సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం పట్టణంలో గీత కార్మిక సంఘం 68వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జెండు ఎగురవేసి మాట్లాడారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలలో ప్రత్యేక కేటాయింపులు చేయాలన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రయోజనాలు చేకూర్చాలన్నారు. అర్హులైన గీత కార్మికులకు పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బెల్లంకొండ వెంకటేశ్వర్లు, చిరంజీవి, దొంతగాని సత్య నారాయణ, కృష్ణ, మట్టయ్య, సైదులు, శ్రీను, మల్లయ్య, ప్రసాద్, శంభులింగం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి



బాకీకార్డులు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తుంగతుర్తి, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): అమలు కాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి, తెలంగాణ ప్రజలను మోసం చేసిందని బీఆర్‌ఎస్ వెలుగుపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లెపాక రాములు అన్నారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ కార్యకర్తలతో కలిసి కాం గ్రెస్ పార్టీ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు బాకీ కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మట్టపల్లి కవిత, నాయకులు గుడిపాటి వీరయ్య, యాకోబు సోమేష్, పరమేష్, పాలబిందెల మల్లయ్య, లింగయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో పాల్గొనాలి

కోదాడటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సమాజసేవలో కోదాడ ఎల్డర్స్ రిక్రియేషన్ సొసైటీ భాగస్వామ్యమవుతుందని సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఏటుకూరి రామారావు అన్నారు. కోదాడ పట్టణంలోని ఎల్డర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన వార్షిక జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా, వైద్యం, క్రీడా సాంస్కృతిక రంగాల్లో అభివృద్ధికి సొసైటీ సహకారం అందిస్తుందన్నారు. విజ్ఞానం, వినోదం, ఆనందం, ఆరోగ్యం అంశాలే సొసైటీకి ప్రధాన సూచికలన్నారు. సమాజంలో సభ్యుల గౌరవాన్ని పెంచే విధంగా ఎల్డర్స్ రిక్రియేషన్ సొసైటీకి కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన సలహాదారు డాక్టర్ జాస్తి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చిన్నపరెడ్డి, ఉపాధ్యక్షులు ఆవుల రామారావు, రామినేని శ్రీనివాసరావు, కోశాధికారి తోట రంగారావు, జాయింట్ సెక్రెటరీ ఎండి జాకీర్, ఇమ్మడి రమేష్, ఈసీ మెంబర్లు, పెదనాటి వెంకటేశ్వరరావు, తూమాటి సురేష్‌రెడ్డి, మాదాల శ్రీధర్, కనగాల బ్రహ్మయ్య, రిటైర్డు డీటీ రమణరావు, పారా సీతయ్య, డాక్టర్ అశోక్‌కుమార్, చంద్రశేఖర్, సట్టు నాగేశ్వరరావు, గంధం బంగారు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

మోతె, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని మామిళ్లగూడెంలో ఆదివారం జరిగింది. స్థానికులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన జూలకంటి సురేష్‌రెడ్డి(35) తల్లి గత సంవత్సరం క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఇంటి వద్ద ఎవరు లేకపోవడంతో తనకున్న పది ఎకరాల వ్యవసాయ భూమిని సేద్యం చేయకుండా కౌలుకు ఇచ్చారు. సాయంత్రం కుమారుడు ఇంటికి రాకపోవడంతో తండ్రి గ్రామంలో తిరిగినా కనిపించలేదు. ఆదివారం ఉదయం గ్రామస్తులు చెరువు వద్దకు వెళ్లగా, చెరువు ఒడ్డున సురేష్‌రెడ్డి మృతదేహం కన్పించింది. కుటుంబసభ్యులు, గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి జూలకంటి ఉపేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సురేష్‌రెడ్డి అవివాహితుడు.

జ్యోతిరావు పూలే ఆశయాలు సాధించాలి

తిరుమలగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బహుజన రాజ్యాధికార స్ఫూర్తి ప్రదాత మహాత్మ జ్యోతిరావు పూలే అని పూలే అధ్యయన వేదక రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య అన్నారు. శనివారం తిరుమలగిరిలోని క్రాస్‌రోడ్‌లో జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పూలే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషిచేశారన్నారు. పూలే ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగట్టు లలిత, కందుకూరి సోమన్న, ప్రవీణ్, తన్నీరు రాంప్రభు, వంగరి బహ్మం, పులిమామిడి సోమన్న, తుమ్మ చంద్రమౌళి, సోమనారాయణ, షకీల్, రవిందర్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హుజూర్‌నగర్ , అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987-88 విద్యా సంవత్సరం 10వ తరగతి విద్యా ర్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సంద ర్భంగా క్రికెట్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మూడు దశాబ్దాల అనంతరం విద్యా ర్థులు కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయతతో పలకరించుకున్నారు. అనంతరం క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజే శారు. కార్యక్రమంలో పెండ్యాల నాగరాజు, కుక్కడపు కోటేశ్వరరావు, జయశంకర్, చందాల శ్రీనివాస్, వెంకట్రావు, యాదగిరి, శ్రీనివాసు, సత్య నారాయణ, రవీందర్, రాంప్రసాద్, జానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ వెలికి తీసేందుకు స్కాలర్‌షిప్ టెస్టు

కోదాడటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సాహం అందించేందుకు స్కాలర్ షిప్ టెస్టు నిర్వహించినట్లు శ్రీనిధి ఫౌండేషన్ నిర్వాహకుడు, ఎస్‌ఆర్‌ఎస్ కాలేజ్ చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి తెలిపారు. ఆదివారం కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల ఎస్‌ఆర్‌ఎస్ కాలేజ్ ఆవరణలో శ్రీనిది ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్కాలర్ షిప్ టెస్టు నిర్వహించారు. 950 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ఉద్యోగం సాధించడం అభినందనీయం



పల్లె సిరివెన్నెలను అభినందిస్తున్న నాయకులు

సూర్యాపేటఅర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మొదటి ప్రయత్నం లోనే గ్రూప్-1 ఉద్యోగం సాధించడం అభినందనీయమని విద్యానగర్ కాలనీవాసులు అన్నారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో గ్రూప్-1 ఉద్యోగం సాధించిన పల్లె సిరివెన్నెలను అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు బాబ్‌సింగ్, నూకల సుదర్శన్‌రెడ్డి, అంగోతు బాబ్‌సింగ్, చింతలపాటి చిన శ్రీరాములు, గోపారపు రాజు, వెంపటి గురూజీ, పురుషోత్తం, వలపట్ల దయానంద్, శ్రీనివాస్, రాఘవరెడ్డి, సుధాకర్, గామయ్య, ఉపేందర్ , లోకాచారి, పాండు, హుస్సేన్, కళ్యాణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు ఆమోదింపజేయాలి

తిరుమలగిరి, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): బీసీ బిల్లు ఆమోదింపజే యాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు కోరారు. ఆదివారం తిరుమలగిరిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ బంద్‌కు సహకరించిన అన్ని రాజకీయ, కుల సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌తో బీసీ బిల్లు ఆమోదింపజేయాలన్నారు. కార్యక్రమంలో వంగరి బ్రహ్మం, చింతకింది సోమనారాయణ, పులిమామిడి బిక్షం, దుస్సా రాంమూర్తి, సుధాకర్, ఉపేందర్, కృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.

కన్నుల పండువగా మాస కల్యాణం

మేళ్లచెర్వు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఇష్టకా మేశ్వరి సమేత స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేకువజామున గణపతి పూజ మాన్యసహపూర్వక రుద్రాభిషేకాలు, స్వామి వారికి పుష్పార్చన నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎన్ శంభిరెడ్డి, ఆలయ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, ఆలయ అర్చకులు విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, సాయి, మహేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి

కోదాడటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంఘం కార్యాలయంలో ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. సంపూర్ణమైన ఆరోగ్యాన్ని అందించే ఆయుర్వేద వైద్యానికి ఆద్యుడు భగవాన్ ధన్వంతరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఆలేటి గోపి, సాయి, సురభి నరసయ్య, ఆలేటి పెద్ద సత్యనారాయణ, పాలూరు సత్యనారాయణ, ఆలేటి చిన్న సత్యనారాయణ, గుడిమల్ల శ్రీహరి, ఆలేటి వెంకటేశ్వర్లు, వినకొల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

తుంగతుర్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మిత్రుడు నిర్మించుకుంటున్న ఇంటికి స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన షేక్‌పాషాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. 2008-2009 పదో తరగతి స్నేహితులు ఆదివారం రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో మిరియాల యాకేష్, గిలకత్తుల మహేష్, పసుపులేటి వెంకన్న, చిటుపాక శ్రీను, సందీప్, మహేష్ పాల్గొన్నారు.

చదువు సాగాలంటే నడకబాటే

● బస్సు సౌకర్యం లేక ప్రతిరోజూ నాలుగు కిలో మీటర్లు నడుస్తున్న విద్యార్థులు ● బస్సు సౌకర్యం కల్పించాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి

మఠంపల్లి, అక్టోబరు 19(ఆంధ్ర జ్యోతి): మఠంపల్లి మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు కాలినడక వెళ్లాల్సి వస్తోంది. స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకే ఉండడంతో పై చదువుల కోసం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న రఘునాథపాలెం గ్రామానికి వెళ్తున్నారు. ఆర్థిక స్థోమత లేక గ్రామంలో ఉన్న ఆటోలకు ఖర్చు భరించేక ప్రతిరోజూ గ్రామానికి చెందిన 12మంది విద్యార్థులు ఉదయం కాలినడకన పాఠశాలకు వెళ్లి సాయంత్రం గ్రామానికి చేరుకుంటారు. గతంలో గ్రామానికి బస్సు సర్వీసు సౌకర్యం ఉండేదని, కొన్ని నెలల క్రితం ఆర్టీసీ అధికారులు పల్లె ప్రాంతాలకు బస్సులను నిలిపివేయడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు తమ గోడును ఆలకించి బస్సు సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ పరంగా సైకిళ్లు అందజేయాలని కోరుతున్నారు. దాతలు ముందుకు వచ్చి ఉచిత ఆటో సౌకర్యం కల్పించి తమ ఉన్నత చదువులకు సహకరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.


గుండ్లపల్లి నుంచి రఘునాథపాలెం పాఠశాలకు కాలినడకన వెళ్తున్న విద్యార్థులు

వైభవంగా లక్ష్మీనృసింహుడి కల్యాణం

మఠంపల్లి, అక్టోబరు 19(ఆంధ్ర జ్యోతి): మట్టపల్లి లక్ష్మీనృసింహుడి ఆలయంలో స్వామికి ఆదివారం విశేష అర్చనలు జరిగాయి. పుష్పాలంకరణల అనంతరం స్తంభోద్భవునికి ఆరె పత్రితో అష్టోత్తర నామార్చనలు, యాగ మండపంలో నారసింహ సుదర్శన హోమాలు నిర్వహించారు. ఉపాలయాల్లో పరివార దేవతలకు ప్రాబోధి నివేదనలు సమర్పించాక క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన నిర్వహించారు. ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపై అధిష్ఠింపజేసి విశ్వక్సేనారాధన వేదపండితులు నిర్వహించారు. రాజ్యలక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, మహర్నివేదనలు నిర్వహించారు. క్షేత్రంలోని శివాలయం లోనూ బ్రాహ్మీ ముహూర్తంలో ఏకాదశ రుద్రాభిషేకం, పంచాయతన పూజలు అర్చకులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సరికొండ నవీన్ పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాజ్యాంగ పరిరక్షణకు కృషిచేయాలి

హుజూర్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలని మానవ వికాస వేదిక జాతీయ అధ్యక్షుడు బి. సాంబశివరావు, జిల్లా అధ్యక్షుడు పీవీ దుర్గాప్రసాద్ కోరారు. పట్టణంలోని టౌన్‌హాల్‌లో ఆదివారం మానవవాద అధ్యయన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలన్నారు. దేశంలోని ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేయడం సరికాదన్నారు. వ్యక్తి తన భావజాలాన్ని స్వేచ్ఛగా చెప్పాలన్నారు. దేశంలో స్వేచ్ఛ లేకుండా పోతుందన్నారు. పౌరుల హక్కులను హరించి వేస్తున్నారు. దేశంలోని అన్ని మతాలను గౌరవించుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మా భాస్కర్, అధ్యక్షుడు పుట్టపాక అంజయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి నర్సింహారావు, జిల్లా కంభంపాటి అంజయ్య, జక్కుల వెంకటేశ్వర్లు, కడారు సైదులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

సూర్యాపేటటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని 14వ వార్డు, 44వ వార్డులకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు రమేష్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలనే కాకుండా ప్రభుత్వం ఇవ్వని హామీలను సైతం అమలు చేస్తున్న చరిత్ర కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. 10 ఏళ్ల పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. అవినీతి పాలన సాగించిన బీఆర్ఎస్‌కు జూబ్లీహిల్స్‌లో జరిగే ఉప ఎన్నికల్లో సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో ప్రజాపాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రజలంతా బ్రహ్మరదం పడుతున్నారని రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పూరరామూర్తియాదవ్, వెలుగు వెంకన్న, వల్దాస్ దేవేందర్, చొక్కయ్య, పాలగాని కృష్ణ, నిమ్మల వెంకన్న, నేరేళ్ల మధుగౌడ్, మాశెట్టి ఉపేందర్, ఆకుల కిశోర్, రాజేష్, రాంబాబు, సురభి, జాని, లింగయ్య, లక్ష్మమ్మ, విజయ పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న పటేల్ రమేష్‌రెడ్డి

ద్విచక్ర వాహనం నుంచి పడి మహిళకు గాయాలు

తుంగతుర్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై మేకలు అడ్డువచ్చి తగలడంతో బైక్‌పై నుంచి పడి మహిళ గాయపడింది. ఈ సంఘటన ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన కొండగడుపుల పరుశురాం సునీత దంపతులు తమ బంధువుల ఊరు మద్దిరాలకు వెళ్లి వస్తుండగా తుంగతుర్తిలో మెయిన్ రోడ్డు పక్క ఉన్న వ్యాపార సముదాయం వారు మేకలను వెళ్లాగొట్టారు. అవి వెళ్లి బైక్‌కు తగలడంతో బైక్‌పై కూర్చున్న సునీత కింద పడింది. దీంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు. తుంగతుర్తిలో కొంతమంది మేకలను విచ్చలవిడిగా వదిలిపెడుతున్నారని వాటితో రోడ్డుపై వెళ్ళే ప్రయాణికులు ప్రమాదాలు జరుగుతున్నాయని పట్టణవాసులు పేర్కొంటున్నారు.